గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు పక్కాగా ఏర్పాట్లు చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

షాబాద్ : అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

షాబాద్, మే 18 : తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్పీఎస్సీ)ద్వారా జూన్ 9న జరుగనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి సూచించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో ఆయన శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఏర్పాట్ల గురించి అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనల గురించి చైర్మన్ తెలియజేశారు. జూన్ 9న ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు పరీక్ష కొనసాగుతుందని తెలిపారు. పరీక్షకు ముందు బయో మెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి రెండు గంటల ముందే కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. ఉదయం 10 గంటల వరకే పరీక్షా కేంద్రంలోకి వెళ్లేందుకు అనుమతించడం జరుగుతుందని, అనంతరం గేట్లు మూసివేయాలని స్పష్టం చేశారు. ఇన్విజిలేటర్లతో పాటు బయోమెట్రిక్ కాప్చర్ కోసం 160 మంది అభ్యర్థులకు ఒకరు చొప్పున ప్రత్యేకంగా అదనపు ఇన్విజిలేటర్‌లను సైతం నియమించాలని సూచించారు. బయోమెట్రిక్ వేలిముద్రల సేకరణ ప్రక్రియ కోసం పోలీసు శాఖ సహాయం తీసుకోవాలని, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు నోడల్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. సెల్‌ఫోన్, క్యాలిక్యులేటర్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, ఎగ్జామ్ ప్యాడ్‌కు అనుమతి ఉండదని, అభ్యర్థులు వీలైనంత వరకు చెప్పులు ధరించి రావాలని హితవు పలికారు. అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డుతో పాటు గుర్తింపు కార్డు, బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్ తీసుకొని రావాలన్నారు. దివ్యాంగులైన అభ్యర్థులు తమకు బదులుగా ఇతరులచే పరీక్ష రాసేందుకు అనుమతి కోరిన చోట, అలాంటివారు ఇంటర్మీడియట్ కంటే తక్కువ విద్యార్హత కలిగిన వారితోనే పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని, తమ వెంట వైకల్యం ధ్రువీకరించే సర్టిఫికెట్ తేవాలని చైర్మన్ స్పష్టం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులంతా ఉదయం 9గంటల వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి పరీక్షా కేంద్రంలోనూ డ్యూయల్ డెస్క్ బెంచులు, పరీక్షా గదుల్లో తగినంత వెలుతురు, సరిపడా లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, అవసరమైన వసతులు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు, అబ్జర్వర్లు, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితరులకు పరీక్షల నిర్వహణ తీరు, నిబంధనలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు వీలుగా శిక్షణా తరగతులు నిర్వహించాలని సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయని ఈమేరకు టీఎస్పీఎస్పీ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రశ్నాపత్రాల లీకేజీలు, మాల్ ప్రాక్టీస్ వంటి వాటికి ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రశ్నా పత్రాలు, ఇతర పరీక్షా సామగ్రిని పోలీసుల బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్ నుంచి ఎగ్జామినేషన్ సెంటర్స్‌కు తరలించాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఇతరులెవరినీ అనుమతించకూడదని చైర్మన్ అన్నారు.

పునశ్చరణ చేసుకోవాలి

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులతో మాట్లాడుతూ.. పరీక్ష నిర్వహణకు జిల్లాలో 93 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 55,692 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు లైజన్ అధికారులను నియమించడం జరిగిందని, వారు చీఫ్ సూపరింటెండెంట్‌తోపాటు పరీక్షా కేంద్రంలో ఉండి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్లు గైడెన్స్ అన్నింటినీ పునశ్చరణ చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు తెలిసేలా పరీక్షా కేంద్రం పేరు, పేపర్ కోడ్, ఏరియా ఆయా పరీక్షా కేంద్రాల ముందు తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. ఇన్విజిలేటర్లు జాప్యం చేయకుండా కరెక్ట్ టైంకు పేపర్ ఇవ్వాలని, టైం పూర్తయిన వెంటనే తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోని అన్ని గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాలు పనిచేయనట్లయితే ముందుగా తెలియజేయాలని చీఫ్ సూపరింటెండెంట్‌లకు సూచించారు. పరీక్షా సమయంలో నిరంతరాయంగా విద్యుత్ ఉండేలా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు, పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు 9 గంటలలోగా చేరుకునేలా ఆయా రూట్లలో తగినన్ని బస్సులను నడపాలని ఆర్టీసీ వారికి, పరీక్షా కేంద్రాల పరిసరాలను పరిశుభ్రం చేయించేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషర్లు, డీపీఓలకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో ఏఎన్ఎమ్‌ను అందుబాటులో ఉంచాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు నో రిలేషన్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. ముందు రోజు కూడా ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇవ్వాలని చీఫ్ సూపరింటెండెంట్లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొన్నారు.

అన్ని చర్యలు తీసుకుంటున్నాం

వికారాబాద్ : గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో 5,468 మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు వీలుగా 13 పరీక్ష కేంద్రాలను గుర్తించామన్నారు. వికారాబాద్‌లో 7, తాండూరులో 4, పరిగిలో 2 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు అన్ని వసతులతో సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. ప్రిలిమినరీ పరీక్ష పూర్తి బందోబస్తు మధ్య, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద మహిళా కానిస్టేబుల్, హోంగార్డులు విధులు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి అమరేందర్ కృష్ణ ఉన్నారు.

వికారాబాద్ : వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కోటిరెడ్డి

రైతులు పండించిన ప్రతి గింజనూ కొంటాం

- వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
- తుంకిమెట్ల, మంబాపూర్, చెంగోల్ కొనుగోలు కేంద్రాల తనిఖీ

తాండూరురూరల్ : తేమ శాతాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

బొంరాస్‌పేట, మే 18 : యాసంగిలో రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శనివారం మండలంలోని తుంకిమెట్ల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి అపోహలు పెట్టుకోరాదన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. సేకరించిన ధాన్యాన్ని సంబంధిత రైస్ మిల్లులకు వెంటవెంటనే చేరవేయాలని ఆదేశించారు. ధాన్యాన్ని లారీల్లో లోడ్ చేయడానికి కూలీల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. ధాన్యం సేకరించిన రైతుల వివరాలను ఓపీఎంఎస్ ట్యాబ్‌లలో పొందుపర్చాలని ఆదేశించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల్లో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యం తడువకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని కేంద్రాల నిర్వాహకులను లింగ్యానాయక్ ఆదేశించారు. తేమ శాతాన్ని దృష్టిలో ఉంచుకుని ధాన్యాన్ని బాగా ఆరబెట్టి కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌వో రాజేశ్వర్, డీసీఎంఎస్ మేనేజర్ ఎల్లయ్య, కేంద్రం నిర్వాహకులున్నారు.

గిట్టుబాటు ధర కల్పిస్తాం

తాండూరు రూరల్ : రైతు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులకు కష్టం రాకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. తాండూరు మండలం, చెంగోల్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తామని.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఆయన వెంట డీసీఎంఎస్ మేనేజర్ ఎల్లయ్య, తహసీల్దార్ తారా సింగ్ ఉన్నారు.

అపోహలు, వదంతులను నమ్మవద్దు

పెద్దేముల్ : అకాల వర్షాల దృష్ట్యా వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడువకుండా ముందు జాగ్రత్తగా టార్పాలిన్‌లను అందుబాటులో ఉంచుకోవాలని, రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మండల పరిధిలోని మంబాపూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు ఎలాంటి అపోహలకు గురి కాకుండా, వదంతులు నమ్మకుండా ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యాన్ని సేకరించాలని కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జిని ఆదేశించారు. ధాన్యాన్ని లారీల్లో ఎత్తేందుకు వీలుగా కూలీల సంఖ్యను పెంచుకోవాలని ఆదేశించారు. ధాన్యాన్ని సేకరించిన రైతుల వివరాలను 'ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం' (ఓపీఎంఎస్ ట్యాబ్)లో పొందుపరచాలని తెలిపారు. ధాన్యాన్ని శుభ్రపరచి, తేమ శాతాన్ని పాటించి తీసుకువచ్చేలా రైతులకు సూచనలు చేయాలని ఆదేశించారు. గన్నీ సంచుల కొరత ఉందని, తగినన్ని టార్పాలిన్లు కావాలని రైతులు కలెక్టర్‌ను కోరగా.. అందుబాటులో ఉంచాలని ఇన్‌చార్జిని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, తాండూరు డీసీఎంఎస్ మేనేజర్ ఎల్లయ్య, వరి కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి నజీర్ ఉన్నారు.



శంకర్‌పల్లిలో నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి చందన బ్రదర్స్ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి నేహాశెట్టి

శంకర్‌పల్లిలో చందన బ్రదర్స్

షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన సినీ నటి నేహాశెట్టి

షాబాద్, మే 18 : శంకర్‌పల్లిలో డీజే టిల్లు హీరోయిన్ నేహాశెట్టి శనివారం సందడి చేసింది. శంకర్‌పల్లిలో నగరానికి చెందిన సత్యనారాయణరావు, జాన్‌బాబు నూతనంగా ఏర్పాటు చేసిన చందన బ్రదర్స్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా నేహాశెట్టి హాజరయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ముందుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం చేసిన అనంతరం షాపింగ్‌మాల్‌ను నేహాశెట్టి ప్రారంభించారు. షాపింగ్ మాల్‌లో ప్రజలు, సిబ్బందితో మాట్లాడారు. హైదరాబాద్‌కు దగ్గర్లో ఉన్న శంకర్‌పల్లిలో చందన బ్రదర్స్ లాంటి షాపింగ్‌మాల్ ఏర్పాటు చేయడం గొప్ప పరిణామమన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదలకు అనుగుణంగా ధరలు అందుబాటులో ఉంచారని ఆమె తెలిపారు. నిర్వాహకులు సత్యనారాయణరావు, జాన్‌బాబు మాట్లాడుతూ.. శంకర్‌పల్లి మండల ప్రజలు హైదరాబాద్‌కు పోవాల్సిన అవసరం లేకుండా ఇక్కడే అందుబాటులో ఉండేలా షాపింగ్‌మాల్ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు నగరం చుట్టుపక్కల ఆరు బ్రాంచీలను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలు సరసమైన ధరలకే షాపింగ్ చేసుకోవచ్చన్నారు. సుమారు 150 మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మొదటి రోజు గొప్ప ఆఫర్ ఇవ్వడంతో షాపింగ్ చేయడానికి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, జడ్పీటీసీ గోవిందమ్మ, మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, నాయకులు ప్రవీణ్‌కుమార్, గోపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బొంపల్లి వరి కొనుగోలు కేంద్రం పరిశీలన

దోమ, మే 18 : వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకొని కొనుగోళ్లు జరపాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి కొనుగోలు కేంద్రాన్ని అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ సాయితేజతో కలిసి శనివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోళ్ల పారదర్శకంగా జరిగి రైతులకు ఇబ్బంది కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కొనుగోలు కేంద్రం నిర్వహకులకు సూచించిన అనంతరం అక్కడే ఉన్న రైతులతో ముచ్చటించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

బొంపల్లి వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

సుజాత పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాలు

సుజాత పాఠశాలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి

- బాలుడి మృతికి నిరసనగా పాఠశాల గేట్ ఎదుట, హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఆందోళన
- బాధితుడి కుటుంబానికి న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమణ

మొయినాబాద్, మే 18 : బాలుడి మృతికి కారణమైన సుజాత పాఠశాల యాజమాన్యం, సంబంధిత సిబ్బందిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని శనివారం మండల పరిధిలోని సుజాత పాఠశాల ఎదుట మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, వివిధ విద్యార్థి సంఘాలు నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. మండల పరిధిలోని సురంగల్ గ్రామానికి చెందిన గాండ్ల విక్రం చిన్న కుమారుడు శివశౌర్యన్ నాగిరెడ్డిగూడ రెవెన్యూ పరిధిలో ఉన్న సుజాత పబ్లిక్ పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్నాడు. సుజాత పాఠశాల యాజమాన్యం ఎవరి అనుమతులు లేకుండా సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేసి విద్యార్థులకు క్రీడలు ప్రాక్టీస్ చేయిస్తున్నారు. విక్రం కూడా తన కుమారుడిని బాడ్మింటన్ కోచింగ్‌కు పంపిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఈ నెల 10న శివశౌర్యన్ కోచింగ్‌కు వెళ్లాడు. బాడ్మింటన్ కోచింగ్ ఇవ్వకుండా ఆ రోజు స్విమ్మింగ్ చేయించాలని పాఠశాల యాజమాన్యం స్విమ్మింగ్ కోచ్‌లను ఆదేశించడంతో చిన్నపిల్లలను స్విమ్మింగ్ చేయించడానికి తీసుకెళ్లారు. శివశౌర్యన్ వయస్సు కేవలం 5 సంవత్సరాలు ఉండటంతో అతన్ని బేబీ స్విమ్మింగ్ పూల్‌లో మాత్రమే చేయించాలి. కాని చిన్న పిల్లలను కూడా పెద్దవాళ్లు చేసే స్విమ్మింగ్ పూల్‌లోకి దింపారు. ఈ విషయాన్ని కోచ్‌లు, అక్కడ ఉండే సిబ్బంది మర్చిపోయారు. శివశౌర్యన్ లోతైన ప్రాంతంలోకి వెళ్లి నీట మునిగి మృతి చెందాడు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే కుమారుడు మృతిచెందాడని బాలుడి తండ్రి విక్రం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పోలీసులు చర్యలు తీసుకోవడంలేదని..

పోలీసులు పాఠశాల యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని, వారిని ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం, విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోవడంలేదనే ఆవేదనతో పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తున్నారని సమాచారం తెలుసుకున్న పోలీసులు పెద్దఎత్తున సుజాత పాఠశాలకు చేరుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు మద్దతుగా గ్రామస్తులు, విద్యార్థి సంఘాలు తరలివచ్చారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యంపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అదే విధంగా పాఠశాల యాజమాన్యం దిగివచ్చి మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పడంతో పోలీసులు ఆందోళనను విరమింపజేశారు. కార్యక్రమంలో మృతుడి తండ్రి విక్రం, పెదనాన్న సంతోష్‌కుమార్, నాయకులు రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, భాస్కరాచారి, రాజు, ప్రభుయాదవ్, మహేందర్‌రెడ్డి, రాజమల్లేశ్, రవీందర్‌రెడ్డి, విక్రంరెడ్డి, గౌతంరెడ్డి, యాదయ్యయాదవ్, సుభాష్‌ముదిరాజ్, సాయిరెడ్డి, జ్ఞానేశ్వర్‌రెడ్డి, జగన్‌రెడ్డి, శ్రీపతిరెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.

ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి..

- షురువైన పచ్చళ్ల సీజన్..
- మామిడి కాయలు పక్వానికి రావడంతో ప్రారంభమైన విక్రయాలు
- తోటలు, మార్కెట్‌లో కొనుగోలు చేసి పచ్చళ్లు పెడుతున్న ప్రజలు

ఇబ్రహీంపట్నంరూరల్, మే 18 : మండే ఎండలతోనే మామిడి సీజన్ వస్తుంది.. తినేందుకు రసాలు.. పచ్చడి పెట్టుకునేందుకు కాయలు పక్వానికి వచ్చే సమయం. నిల్వ పచ్చడి పెట్టుకునేవారు తోటలు, మార్కెట్‌ల చుట్టూ తిరిగి మంచి కాయలు కొనుగోలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. తమ ఇంటి అవసరాలతో పాటు పచ్చళ్లు పెట్టి విక్రయించేవారికి ఇది సమయమే. ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి.. అని నోరూరించే విధంగా పచ్చళ్లు తయారీచేసే పనిలో లీనమయ్యారు. ఏడాదికి సరిపడా తయారుచేసి నిల్వపెట్టుకుంటారు. ఇంట్లో కూర లేకపోయినా భోజనంలో మామిడికాయ తొక్కు వేసుకుని రుచిగా లాగించేస్తారు. పచ్చడిలో నెయ్యి లేదా మీగడ కలుపుకుని తింటే ఆ రుచి వర్ణనకందని విధంగా ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో మామిడికాయ పచ్చళ్లను వివిధ రకాలుగా పెట్టుకుంటారు. చిన్న రసాలు, గులాబీలు, మల్లి, తోతాపురి, నాటు మామిడికాయలతో పచ్చడి పెట్టుకుంటారు. చిన్న రసాల కాయలు మంచి పీచుతో ఉండి.. ఎక్కువ కాలం మన్నడంతో పాటు రుచిగా ఉంటుంది. ముక్కలు గట్టిగా ఉండి పీచుకు కారం, ఉప్పు పట్టి టేస్టీగా ఉంటుంది.

కాయ ఒక్కటే.. పచ్చళ్లు అనేకం..

మామిడి కాయలతో అనేక రకాల పచ్చళ్లు పెట్టుకోవచ్చు. తినాలనే కోరిక ఉండాలే కానీ.. రోజుకో రకం పచ్చడిని తినేయవచ్చు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉన్న సమయంలో 100 నుంచి 200మామిడి కాయలతో వివిధ రకాల పచ్చళ్లు పెట్టుకునేవారు. దీంతో ఉమ్మడి కుటుంబానికి అవి సరిపోయేవి. ఎల్లిపాయ పచ్చడి, ఆవకాయ పచ్చడి, మెంతికాయ పచ్చడి, ముక్కల పచ్చడి, జీడి ఆవ పచ్చడి, నువ్వు ఆవ పచ్చడి వంటి రకాలను పెట్టుకుంటారు. ఇవన్నీ మామిడి కాయలతోనే చేసినా ఒక్కొక్కటి ఒక్కో రుచితో తిన్నాకొద్దీ తినాలని పించేలా ఉంటాయి.

ఆవకాయ పచ్చడి

25 మామిడి కాయలకు మూడు డబ్బాల కారం, మూడు డబ్బాల ఆవపిండి, మూడు డబ్బాల ఉప్పు, కేజీ నూనె, మెంతులు, పసుపు కావాలి. కారం, ఆవపిండి, పసుపు, ఉప్పు కలిపి.. అందులో నూనె పోయాలి. ఈ మొత్తంలో మామిడి ముక్కలు పోసుకుంటూ కలపాలి. మొత్తం సిద్ధమయ్యాక ఒక జాడిలో పెట్టుకోవాలి. ఆవకాయ పచ్చడి మంచి రుచిగా ఉండి.. మళ్లీ మళ్లీ తినాలనిపిస్తుంది.

ఎల్లిపాయ కారం

ఎల్లిపాయతో మామిడికాయ పచ్చడి పెట్టాలంటే 25 కాయలకు మూడు డబ్బాల కారం, ఒక డబ్బా ఎల్లిపాయలు, మూడు డబ్బాల ఉప్పు, పసుపు, కేజీ నువ్వుల నూనె, కొన్ని



మెంతి పచ్చడి

మెంతి పచ్చడి రుచిగా ఉంటుంది. దీనికి కూడా 25 మామిడి కాయలకు మూడు డబ్బాల కారం, రెండు డబ్బాల మెంతి పిండి, మూడు డబ్బాల ఉప్పు, కేజీ నూనె, పసుపు ఉంటుంది. కారం, మెంతి పిండి, ఉప్పు, పసుపు కలిపి.. అందులో నూనె పోసుకోవాలి. ఆ మొత్తంలో మామిడి ముక్కలను కలిపేస్తే మొంతికాయ పచ్చడి అయినట్లే. ఈ మూడు కూడా దేనికి అదే డిఫరెంట్ రుచితో ఉంటాయి.

నువ్వు ఆవ పచ్చడి

నువ్వుల ఆవ కూడా రుచిగా ఉంటుంది. పచ్చడి తయారీకి 25 మామిడికాయలకు.. మూడు డబ్బాల కారం, మూడు డబ్బాల ఉప్పు పసుపుతో పాటు పావు కేజీ నువ్వుల పొడి తీసుకోవాలి. అలాగే కేజీ నూనె సిద్ధంగా ఉంచుకోవాలి. వీటిలో కారం, ఉప్పు, పసుపుతో పాటు నువ్వుల పొడిని కలుపుకోవాలి. అందులో మామిడికాయ ముక్కలను కలిపి నూనె పోసుకోవాలి. దీంతో నువ్వు ఆవ సిద్ధమైనట్లే.

మెంతులు అవసరమవుతాయి. ముందుగా కారం, పసుపు, ఉప్పు కలుపుకోవాలి. అందులో నూనె పోసి మెంతులు వేయాలి. ఇందులో మామిడికాయ ముక్కలు వేసి కలపాలి. ఆ తర్వాత ఎల్లిపాయలు కొంత కచ్చాపచ్చాగా దంచి వేయాలి. మొత్తం ఒక్కసారి కలపాలి. దీంతో ఎల్లిపాయ కారం రెడీ అయినట్లే.

జీడి ఆవ పచ్చడి

జీడి ఆవ పచ్చడి తింటుంటే ఘాటుని ఇస్తుంది. ఇందుకు 25 మామిడి కాయలను కోసుకుని.. కాయల మధ్యలో ఉండే జీడిని పక్కన పెట్టుకోవాలి. మూడు డబ్బాల కారం, మూడు డబ్బాల ఉప్పు, సరిపడా పసుపు, ఒక కేజీ నూనె అవసరం ఉంటుంది. కాయల మధ్యలో ఉన్న జీడిని మిక్సీ పెట్టుకోవాలి. అందులో కొంత నీటిని పోసి.. ఒక గిన్నెలో దానిని వడబోయాలి. కారం, ఉప్పు, పసుపు కలుపుకోవలి. అందులో నూనెతో పాటు జీడి ఉన్న నీటిని కలిపివేయాలి. అందులో మామిడి కాయలు కలుపుకుంటే జీడి ఆవ సిద్ధమైనట్లే..

అత్తెల్లిలో న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా కోర్టు జడ్జి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, మే 18 : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్ జిల్లా జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ మండల పరిధి అత్తెల్లి గ్రామంలో అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సహకారంతో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టాల గురించి అవగాహన లేకుంటే ఏమీ తెలియదన్నారు. అవగాహన ఉండటం వల్ల వారివారి హక్కుల కోసం హక్కుల సాధన కోసం కృషి చేయవచ్చన్నారు. బడీడు పిల్లలను బడిలో ఉంచాలని, బాల్యంలో అందరూ చదువుకోవాలని తెలిపారు. బాల్య వివాహాలు చేయడం నేరమని, వివాహ వయస్సు వచ్చాక పెండ్లిళ్లు చేయాలని సూచించారు. భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు లేబర్ కార్డులు తీసుకోవాలని, వాటి ద్వారా